ప్రజాశక్తి
ఆదివారం 3 సెప్టెంబర్ 2023
8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

'బార్క్' భూ భాగోతం

◆ ప్రభుత్వం మారినప్పుడల్లా కొత్త జాబితా తయారీ ◆ తెరమీదకు కొత్త పేర్లు
◆ అధికారుల సంతకాల్లేకుండా జాబితా విడుదల ◆ పరిహార సొమ్ము కాజేసేందుకు పెద్దల ప్రయత్నం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రభుత్వం మారిన ప్రతిసారీ బాబా అణు విద్యుత్ పరిశోధన కేంద్రం (బార్క్) భూ పరిహార లబ్ధిదారుల జాబితా మారుతోంది. టిడిపి ప్రభుత్వంలో తయారుచేసిన జాబితాలోవున్న కొన్నిపేర్లు తాజాగా తయారుచేసిన జాబితాలో లేవు. తాజా జాబితాలోని పేర్లు ఆనాడు టిడిపి ప్రభుత్వ కాలంలో తయారుచేసిన జాబితాలో లేవు. ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లను తట్టుకోలేక సాగులోలేని స్థానిక, స్థానికేతరుల పేర్లు జాబితాలోకి ఎక్కినా ప్రభుత్వ యంత్రాంగం కాదనలేక మౌనంవహిస్తోంది. బార్క్‌కు కావాల్సిన కొండపోరంబోకు భూమిని అప్పగిస్తే చాలన్నట్లు అధికారులున్నారు. అచ్యుతాపురం మండలం తంతడి సర్వే నెంబరు 141, 238ల్లో బార్క్‌కు కేటాయించిన కొండపోరంబోకు భూముల్లో డి పట్టాదారులు, పేద రైతులు, వృత్తిదారులు ఎంతోకాలంగా సాగులోవున్నారు. గ్రామ సభ నిర్వహించి వీరికి పరిహారం చెల్లించేందుకు కసరత్తు చేయకుండా అందుకు భిన్నంగా వాస్తవ సాగుదారుల విస్తీర్ణం తగ్గించి, సాగులోలేని స్థానికేతరుల పేర్లతో జాబితా



బార్క్‌కు కేటాయించిన భూమి

తయారు చేయడంతో తరచూ బార్క్ పరిహారం వివాదాస్పదమవుతోంది.

బార్క్‌కు కేటాయించిన భూములకు పరిహారం చెల్లించడానికి కొద్ది రోజుల క్రితం తయారుచేసిన సాగుదారుల జాబితా అనేక అనుమానాలకు, విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీ నాయకులు సూచించిన పేర్లతో జాబితా తయారు చేశారన్న విమర్శలు ఇప్పుడు వినిపిస్తున్నట్లే టిడిపి ప్రభుత్వంలోనూ ఈ తరహా విమర్శలు వచ్చాయి. వాస్తవ సాగుదారులను గుర్తించడంలో పెరుగుతున్న రాజకీయ జోక్యంతో దాదాపు దశాబ్దమవుతున్నా పరిహారం చెల్లించలేని మిగతా 2లో..

వీఎంఆర్‌డిఏ పరిధిలో..

చకచకా అభివృద్ధి ప్రాజెక్టులు

◆ పిపిపికే ప్రాధాన్యం
◆ రూ.220 కోట్లతో కన్వెన్షన్ సెంటర్, ఫైవ్ స్టార్ హోటళ్లు
◆ రూ.7.8 కోట్లతో ఓసెన్ డెక్ ఏర్పాటు
◆ కైలాసగిరిపై రూ.5 కోట్లతో సైన్స్ సిటీ, మ్యూజియం
◆ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వచ్చే ఆరు నెలల్లో పలు అభివృద్ధి ప్రాజెక్టులు విఎంఆర్‌డిఎ పరిధిలో ఆచరణ రూపం దాల్చి సందర్శకులను, విశాఖ ప్రజలను కనువిందు చేయనున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. శనివారం విఎంఆర్‌డిఎ భవనంలో అధికారులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.220 కోట్లతో వుడా పార్కులో కన్వెన్షన్ సెంటర్, 200 రూమ్‌లతో ఫైవ్ స్టార్ హోటల్, వాటర్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు అనుమతులు లభించాయని తెలిపారు. అలాగే ఎంజిఎం పార్కులో 45 మీటర్లు సముద్రంలోకి డెక్ వెళ్లేలాగ 'ఓసెన్ డెక్' నిర్మాణాన్ని రూ.7.8 కోట్లతో చేపట్టనున్నామన్నారు. పిపిపి మోడ్‌లోనే విఎంఆర్‌డిఎ పలు ప్రాజెక్టులను చేపట్టి నిర్వహణను బయటవాళ్లకు ఇవ్వనుందన్నారు.

ఎపి కార్యనిర్వాహక రాజధానిగా విశాఖను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాత పలు ఇంజినీరింగ్ పనులను విఎంఆర్‌డిఎ నిర్వహించేలా పథకం రూపొందించినట్లు తెలిపారు. జగనన్న ఒక సెంటు ప్లాట్లు 83 కాలనీలలో పనులకు రూ.175 కోట్లతో తాత్కాలిక మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నామని, 46 లే అవుట్లలో భూమి ఇచ్చిన రైతులకు రూ.200 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తూ త్వరలో వీటిని హేండోవర్ చేస్తున్నామని అన్నారు. కైలాసగిరిలో గతంలో ప్రపంచ బ్యాంకు నిధులు రూ.10 కోట్లతో చేపట్టిన పనులు ఆగిపోవడంతో తిరిగి తాము ఆ పనుల కోసం మిగతా 2లో..

4న విశాఖకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్

▶ వార్త 2లో..

పురోగతిలో ఎకో వైజాగ్

▶ వార్త 2లో..

విజయవాడ డివిజన్‌లో భారీగా రైళ్ల రద్దు

▶ వార్త 8లో..

ఘనంగా జాతీయ సంగీత నాటకోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతదేశం సంగీత, కళలకు అనాదిగా ప్రసిద్ధిగాంచిందని, దాన్ని తిరిగి పునరుజ్జీవం చేయడానికి విద్యా విధానంలో సంగీత, కళలను ప్రవేశ పెట్టాలని భారత పూర్వ ఉప రాష్ట్రపతి డాక్టర్ ఎం.వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. విశాఖలోని విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, కళాభారతి సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న విఎండిఎ కళా భారతి జాతీయ సంగీత నాటకోత్సవాలను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలకూ, వయసుకూ సంబంధం లేదన్నారు. అనంతరం విశిష్ట అతిథిగా విచ్చేసిన వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాసన్, సంస్థ అధ్యక్షులు ఎంఎస్ఎన్ రాజు, కార్యదర్శి జిఆర్‌కె.ప్రసాద్ తదితరులు ప్రముఖ వాయులీన విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామికి నాద విద్యా భారతి పురస్కారం అందించారు. లక్ష రూపాయల నగదు, స్వర్ణ కమలాన్ని కూడా అందజేశారు.



వైభవ్ జ్యూయలర్స్ సమకూర్చిన స్వర్ణ కమలాన్ని రామస్వామికి అందజేస్తున్న వెంకయ్యనాయుడు

వైభవ్ జ్యూయలర్స్ 'స్వర్ణకమలం' వితరణ

మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యూయలర్స్ లిమిటెడ్ (వైభవ్ జ్యూయలర్స్) కార్పొరేట్ సామాజిక సేవలో భాగంగా కళలను, సంగీతాన్ని ప్రోత్సహించడంలో 18 ఏళ్లుగా తన కృషి కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (కళాభారతి)లో జరిగే నేషనల్ ఎమినెన్స్ అవార్డ్ ఫంక్షన్‌లో 2002 నుంచి భారతదేశంలోగల ప్రఖ్యాత మిగతా 2లో..

4న ధర్నాలను జయప్రదం చేయండి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి

అధిక ధరలు తగ్గించాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విద్యుత్ భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఎం చేపట్టిన సమర భేరి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4న మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. రూ.450 ఉన్న గ్యాస్ రూ.1200కి పెరిగిందని తెలిపారు. కూరగాయలు, పప్పులు, నూనెలు 50 శాతం పెరిగి ప్రజలను ఇబ్బందులపాల్జేశాయన్నారు. ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం బడా వ్యాపారుల కొమ్ముకాస్తోందని విమర్శించారు. అలాగే యువతకు ఉద్యోగావకాశాలను కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పన జిఒను ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. డిగ్రీ, పిజిలు చదివిన వారు ఉపాధి హామీ కూలి పనులకు వెళ్తున్నారని, నేడు ఆ పథకాన్ని సైతం ఎత్తేసే కుట్ర జరుగుతోందని తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా ప్రభుత్వాలు ఎలా మోసం చేస్తున్నాయో లోకనాథం వివరించారు.

నేడు నిరుద్యోగ ర్యాలీలు

విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి : ఆదివారం సాయంత్రం 4 గంటలకు విశాఖలోని సరస్వతీ పార్కు నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు నిరుద్యోగ ర్యాలీ ఉంటుందని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సాయంత్రం 6 గంటలకు అనకాపల్లి రింగ్ రోడ్డులో కాగడాల ప్రదర్శన ఉంటుందని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. అధికారం అప్పగిస్తే సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని, దేశంలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హామీనిచ్చి యువతను ఎలా మోసగించిందో తెలిపారు.

మొదటి పేజీ తరువాయి..

'బార్క్' భూ భాగోతం

పరిస్థితి ఏర్పడింది. తంతడి పంచాయతీలో తంతడి, వాడపాలెం, యాతపాలెం వున్నాయి. తంతడి సర్వే నెంబరు 238లో మొత్తం 227.20 ఎకరాలకు 376 మంది పేర్లతో తాజాగా జాబితా తయారుచేశారు. సర్వే నెంబర్ 141లోని రాజానపాలెం పంచాయతీలోని రాజానపాలెం, దాసరిపాలెం, అంగవాని పాలెంకు చెందిన 121.18 ఎకరాల్లో 205 మంది డి.పట్టాదారులు, సాగుదారులు వున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

అభ్యంతరాల స్వీకరణకు తంతడి గ్రామ సచివాలయంలో ప్రదర్శించినట్లు చెబుతున్న సాగుదారుల జాబితాలో అధికారి సంతకం, పేరు, స్టాంప్ లేకపోవడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ జాబితా రెవెన్యూ అధికారులు తయారుచేశారా ? స్థానిక అధికార పార్టీ నాయకులు తయారుచేసి ప్రదర్శించారా ? అన్న చర్చ జరుగుతోంది. సంబంధిత అధికారి సంతకం లేకుండా జాబితా విడుదల చేయడం వెనుక అధికార పార్టీ నాయకుల మతలబు వుందని స్థానికులు అంటున్నారు. అధికార పార్టీ ఒత్తిళ్లను తట్టుకోలేక, ప్రతిపాదనలను కాదనలేక తయారు చేస్తున్న జాబితాలతో ప్రభుత్వ యంత్రాంగం విమర్శలపాలవుతోంది. తమకు కావాల్సిన పేర్లను నమోదు చేసుకోవడంలో సర్దుబాటు చేసుకోలేక వచ్చిన స్థానిక వివాదంతో ఈ వ్యవహారం మరోసారి బయటకు వచ్చింది. సాగులోలేరని కొంతమంది డి పట్టాదారులను జాబితా నుంచి తొలగించి, తమకు కావాల్సిన వారి పేర్లు చేర్చుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అలాగే సాగులోలేని పలుకుబడి కలిగిన నాయకుల పేర్లు, బినామీల పేర్లు జాబితాలోకి ఎక్కినట్లు తెలిపారు.

2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారమివ్వాలి



బార్క్‌లో భూములు కోల్పోయిన వారితో పాటు భూమిపై ఆధారపడి బతుకుతున్న వృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి. గ్రామ సభ ద్వారా వాస్తవ సాగుదారులను గుర్తించాలి. సచివాలయంలో జాబితా ప్రదర్శించిన విషయం గ్రామాల్లో చాటింపు ద్వారా ప్రజలకు తెలియజేయాలి. అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇచ్చి, తుది జాబితా తయారుచేయాలి. పేదలు, వృత్తిదారులకు అన్యాయం జరగకుండా పరిహార జాబితా తయారుచేయాలి.

ఆర్.రాము, సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్

సాగుదారులందరినీ గుర్తిస్తాం



2019లో జరిగిన సర్వే ఆధారంగా సాగుదారులతో భూమిపై ఫొటోలు తీసి జాబితా తయారు చేయడమైంది. ఇంకెవరైనా వుంటే వారిని కూడా గుర్తించేందుకు జాయింట్ కలెక్టర్ కమిటీని నియమించారు. గ్రామ సభలు మూడుసార్లు నిర్వహించాం. నిబంధనల ప్రకారం సాగుదారులను గుర్తించాం. ఏ ఒక్కరినీ విడిచిపెట్టకుండా సర్వే చేస్తాం.

చిన్నికృష్ణ, ఆర్‌డిఒ, అనకాపల్లి

చకచకా అభివృద్ధి ప్రాజెక్టులు

రూ.75 లక్షలు వెచ్చించి తెలుగు మ్యూజియాన్ని రెన్నోవేషన్ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కాలంలో కైలాసగిరిని బాగా అభివృద్ధి చేశామన్నారు. రూ.35 లక్షలతో హెల్త్ ఎరీనా, వాకింగ్ ట్రాక్ బాగు చేశామన్నారు. తెన్నేటి పార్కును రూ.77 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. దీనికోసం టెండరు కూడా పిలిచామన్నారు. నగర పరిధిలో 3 వ్యూ పాయింట్లను అభివృద్ధి చేయడంతో ప్రజానీకం, సందర్శకులు సాయంత్రం వేళ సాగరతీరంలో ఆహ్లాదకరంగా గడుపుతున్నారన్నారు. విఎంఆర్‌డిఎ పరిధిలో కొత్తగా నాలుగు ప్రాజెక్టులు చేపట్టామని వెల్లడించారు. కైలాసగిరిపై కాటేజీలు, రెస్టారెంట్ నిర్మాణం రూ.18 కోట్లు వెచ్చించనున్నామన్నారు. ఓసెన్ డెక్‌ను వంద మంది సముద్రం దిగువన సమావేశం అయ్యేలాగ ముంబయి తరహాలో ఏర్పాటు చేయనున్నామన్నారు. దీంతో సందర్శకులకు కొత్త ఫీల్ విశాఖపై వస్తుందన్నారు. వైశాఖి జల ఉద్యానవనంలో రూ.22 కోట్లతో పిపిపి కింద రిక్రియేషన్ జోన్ పెడుతున్నామన్నారు. కైలాసగిరిపై రూ.5 కోట్లతో సైన్స్ సిటీని పిల్లల కోసం హైదరాబాద్ తరహాలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్‌ఎడి వద్ద 2024 జనవరి నాటికి ఆర్‌ఒబి ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగరంలో రెండు కన్వెన్షన్ సెంటర్ల అభివృద్ధికి చేమలాపల్లిలో రూ.5.9 కోట్లు, ఎండాడలో రూ.6.8 కోట్లను వెచ్చిస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి చేస్తున్న పలు ప్రాజెక్టుల వద్ద డిజిటల్ టికెట్ సిస్టం ఉంటుందని తెలిపారు. విఎంఆర్‌డిఎ పరిధిలో 200 పైచిలుకు వేకెంట్ ప్లాట్స్ గుర్తించామన్నారు. వేలం కోసం ఈ-కొనుగోలు నిర్వహించగా 60 ప్లాట్లు అమ్మకానికి వచ్చాయన్నారు. రూ.51 కోట్లు ఆదాయం లభించిందని తెలిపారు. దాకమర్రి లే అవుట్‌లోని ఎల్‌ఐజి అన్నీ అయిపోయాయని, ఎంఐజి, హెచ్‌ఐజి వేలం ప్రస్తుతం నడుస్తోందని అన్నారు. విఎంఆర్‌డిఎ పరిధిలో 587 షాపులున్నాయన్నారు. సమావేశంలో విఎంఆర్‌డిఎ సెక్రటరీ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సంగీత నాటకోత్సవాలు

సంగీత కళాకారులను 'స్వర్ణకమలం'తో సత్కరిస్తూ వస్తోంది. శనివారం కూడా అలాగే తన కళాభిమానాన్ని చాటుకుంది. పద్మశ్రీ అన్నవరపు రామస్వామికి వైభవ్ జ్యూయలర్స్ ఛైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి మల్లికా మనోజ్ 'స్వర్ణకమలం' బహూకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా సాంస్కృతిక కళలను ప్రోత్సహించడంలో వైభవ్ సహకారం కొనసాగుతుందని తెలిపారు.


అదానీకే వత్తాసా !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ఏ గూటి చిలకలు ఆ గూటి పలుకులే పలుకుతాయి', 'ఏ ఇంటి కుక్క ఆ యజమాని పట్ల విశ్వాసంగా ఉంటుంది' అనే మాటలు ఎంత నిజమో ? రాష్ట్ర ప్రభుత్వం తనకు హక్కుగా మిగిలిన 10 శాతం వాటాను అదానీ గంగవరం పోర్టుకే వదిలేసి వంద శాతం చేతులెత్తేశాక ఇంకా ఏముంటుంది ?. అధికార పార్టీ గణం ఏమైనా అదానీ గీసిన గీత దాటుతుందా ?.. తిండి, నిద్రాహారాలు మానేసి పిల్లా పాపలతో 65 రోజులుగా రోడ్డునపడి కనీస వేతనాలు, ఉపాధి కోసం పోరాడుతున్న కార్మికులవైపు నిలబడాలని పాలకులు అనుకుంటారా?.. కానేకాదు.. యజమాని ప్రయోజనాలే వీరి నోటి నుంచి బయటకొస్తాయన్నది 'గంగవరం అదానీ పోర్టు'కు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు వత్తాసు పలుకుతున్న తీరు పట్టిచూపుతోంది. పోర్టు కోసం వేల ఎకరాలను స్థానిక రైతులు, మత్స్యకారులు త్యాగం చేశారు. అలాగే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన వందల ఎకరాల భూములను సైతం కారుచౌకగా కొట్టేసిన నాటి 'రాజు' గంగవరం నుంచి నేటి అదానీ గంగవరం వరకూ ఒకే పంథా.

అసలేం జరుగుతోంది?

65 రోజుల నుంచి గంగవరం పోర్టు నిర్వాసిత రైతు కుటుంబాలు, పోర్టులో ఉద్యోగాలు చేస్తున్న కార్మికులు తమకు కనీస వేతనం ఇవ్వడం లేదని, వైజాగ్ పోర్టులో కార్మికులకు వర్తించే చట్టాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ పోరాడుతున్నారు. అయితే, రూ.వేల కోట్లు టర్నోవర్ సాధించి దేశంలో ప్రధాన ప్రైవేట్ పోర్టుల్లో ఒకటైన గంగవరంలో షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంతో కార్మికులకు కనీస జీతం రాకుండా అణచివేయడం ఏమిటన్న ఇంగితం కూడా పాలకులకు ఉండకపోవడం విడ్డూరం. ఇటీవలే ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి గుడివాడ



అమర్‌నాథ్, స్థానిక ఎంఎల్‌ఎ నాగిరెడ్డి సమక్షంలో జరిగిన చర్చలకు అదానీ యాజమాన్యం తరపున ఎవ్వరూ రాకుండానే అధికార పార్టీ నేతలు మేనేజ్ చేసేశారు. రూ.12500కు మించి గడచిన 15 ఏళ్లుగా అక్కడి కార్మికులకు జీతం లేదు. దీన్ని రూ.25 వేలకు చెయ్యాలని కార్మికులు డిమాండ్ చేస్తుంటే వీరి చర్చల్లో కేవలం రూ.1500 మాత్రమే అదనంగా పెంచుతామని అదానీ తరపున పాలక ప్రతినిధులు మాట్లాడడం చూస్తే వీరు అధిక సంఖ్యాకులైన కార్మికుల పక్షమా ? అల్పసంఖ్యాకులైన పరిశ్రమాధిపతుల వైపా ? అన్నది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. 2021-22లో అదానీ గంగవరం పోర్టుకు రూ.760 కోట్ల మేర లాభాలు వచ్చాయి. దీంట్లో ఒక్క శాతం జీతాలకు కేటాయించినా ఇప్పుడిచ్చే జీతం కంటే అదనంగా కార్మికులకు ఇవ్వొచ్చు. ఇలా ఇచ్చేస్తే తమకు రావాల్సింది రాకుండా పోతుందన్న ఆందోళన నేతల్లో స్పష్టంగా కనిపిస్తోంది. సిపిఎం, సిపిఐ మాత్రమే గంగవరం కార్మికులకు అండగా నిలబడుతున్నాయి. అధికార పార్టీ పెద్దలు మాత్రం కార్మికులకు అన్యాయం జరుగుతుందని తెలిసి కూడా...వారి నోళ్లు నొక్కేసైనా సరే రూ.1500 విసిరేద్దామని చూస్తున్నారు. అయితే సిఐటియు, సిపిఎం ఇచ్చిన పోరాట స్ఫూర్తితో గంగవరం పోర్టు కార్మికులు, నిర్వాసిత రైతు కుటుంబాలు వెనక్కి తగ్గకపోవడం విశేషం. తమ న్యాయమైన కోర్కెల సాధనే లక్ష్యంగా ముందుకు ఉరకడానికే సిద్ధమవ్వడం స్ఫూర్తిదాయకం.

4న విశాఖకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్

రూ.333.56 కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర పోర్టులు, నౌకాయాన రవాణా, ఆయుష్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ విశాఖపట్నం పోర్టు అథారిటీ పరిధిలో ఈ నెల 4న రూ.333.56 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రారంభోత్సవ ప్రాజెక్టుల పనుల ఏర్పాట్లలో ఇప్పటికే నిమగ్నమయ్యారు.. రూ.33.80 కోట్ల వ్యయంతో ఆర్ 11 ప్రాంతంలో నిర్మించిన కవర్డ్ స్టోరేజ్ యార్డ్‌ను మంత్రి ప్రారంభిస్తారు. స్టాక్ యార్డుల నుంచి ఉత్పత్తి అయ్యే కాలుష్యాన్ని నియంత్రించడం కోసం దీనిని నిర్దేశించారు. ఒఆర్ 1, ఒఆర్ 2, ఒఆర్ 3 బెర్తుల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుడతారు. అందుకోసం రూ.167.66 కోట్ల పెట్టుబడి పెట్టారు. 20 ఎకరాల్లో నిర్మించిన ప్రపంచ స్థాయి ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌ను అందుబాటులోకి తెస్తారు. రూ.36.05 కోట్లతో దీన్ని అభివృద్ధి పరిచారు. రూ.96.05 కోట్ల వ్యయంతో విశాఖ పోర్టులో నిర్మించిన అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌ను ప్రారంభిస్తారు.

జగన్‌కు దోచుకోవడం, దాచుకోవడమే తెలుసు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి దోచుకోవడం, దాచుకోవడం తప్ప అభివృద్ధి చేయడం చేతకాదని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ విమర్శించారు. శనివారం 35వ వార్డు పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో విఫలమైందని అన్నారు.

పురోగతిలో ఎకో వైజాగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి ఆధ్వర్యంలో ఎకో - వైజాగ్ కార్యక్రమాలు పురోగతిలో ఉన్నాయని కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ శనివారం ఉదయం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. జూలై , ఆగష్టు నెలల్లో 63,415 రైడ్స్ నిర్వహించి 4250 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేశామన్నారు. ఎకో క్లీన్‌లో భాగంగా 6 బీచ్ క్లీనింగ్ వాహనాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు. మట్టి విగ్రహాలతో అందరూ వినాయక చవితి జరుపుకోవాలని కోరారు.

బస్‌బే ప్రమాదంపై మాట్లాడుతూ..

ఇటీవల కూలిపోయిన బస్ బేపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కాంట్రాక్టర్, జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం అందులో దాగి ఉందని, ఇప్పటికే కాంట్రాక్టర్‌ను బ్లాకు లిస్టులో పెట్టామని తెలిపారు. వారం రోజుల్లో సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు.

ఇచ్చిన నమూనా ప్రకారం నిర్మాణం చేపట్టకపోవటంతోనే ఈ ప్రమాదం సంభవించిందని తెలిపారు,

శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆత్మకూరి శంకరరావుకు ఘననివాళి



ఉత్తమ సేవకులను అభినందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- వేపగుంట : శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకరరావు 92వ జయంతిని నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో నిర్వహించారు. ఈసందర్భంగా శంకరరావు విగ్రహానికి ఆత్మకూరి కృష్ణకుమార్, విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీలు కె రాధాకృష్ణన్, జనరల్ మేనేజర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకర్ ఫౌండేషన్ సమాజ సేవ, అభివృద్ధిలో భాగస్వాములౌతున్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన 200 స్వచ్ఛంద సంస్థలు, విజన్ సెంటర్ల ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో అత్యుత్తమ సేవలు అందించిన వారిని కృష్ణకుమార్, రాధాకృష్ణన్ సత్కరించారు. 4,18,684 కంటి శస్త్రచికిత్సలు చేసి రికార్డు స్థాయిలో మైలురాయిని సాధించడంలో భాగస్వాములైన వారందరూ అభినందనీయులన్నారు. అంతకుముందు ఆస్పత్రిలోని అత్యాధునిక సదుపాయాలను డాక్టర్ టి రవీంద్ర, డాక్టర్ నస్రీన్, డాక్టర్ శిరీష, డాక్టర్ కృష్ణ, డాక్టర్ సుపర్ణ తమ ప్రదర్శనల ద్వారా వివరించారు. డిజిఎం వి.రమేష్‌కుమార్, సీనియర్ మేనేజర్ (అవుట్ రీచ్) అప్పలరాజు, పిఆర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె. బంగారరాజు, వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ కొత్త కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-ఆనందపురం : విద్యుత్ కొత్త కనెక్షన్లు, మీటర్ల కోసం గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఇ సురేష్ కుమార్ తెలిపారు. అలాగే విద్యుత్ వినియోగదారులు అందరూ తమ సర్వీసులకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలన్నారు స్థానికంగా ఉన్న లైన్‌మెన్ వద్ద, విద్యుత్ కార్యాలయంలో, బిల్లు కలెక్టర్ వద్ద, ఈస్ట్రన్ పవర్ రూప్, ఎపిఇపిడిసిఎల్ వెబ్‌సైట్‌లో ఆధార్ అనుసంధానానికి అవకాశం ఉందని తెలిపారు.

ప్రపంచస్థాయికి తెలుగు సినిమా

ప్రేక్షకులతో ముఖాముఖిలో సినిమాటోగ్రాఫర్, 'కళ్లు' చిత్ర దర్శకుడు ఎంవి.రఘు



ఎంవి.రఘుతో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు

ప్రజాశక్తి- సీతమ్మధార : తెలుగు సినిమా ప్రపంచస్థాయికి ఎదిగిందని, ప్రేక్షకుల అభిరుచులకు తగ్గట్టుగా తీసిన సినిమాలే విజయవంతమౌతాయని సీనియర్ సినిమా ఫోటోగ్రాఫర్, కళ్ళు సినిమా డైరెక్టర్ ఎంవి.రఘు అన్నారు. శనివారంవైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో తెలుగు సినిమా పోకడలు అంశంపై డాక్టర్ ఎల్ బుల్లయ్య కాలేజీ ప్రాంగణంలోని గాంధీయన్ సెంటర్‌లో రఘుతో ముఖాముఖి నిర్వహించారు.. ఈ సందర్భంగా వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశ రావు మాట్లాడుతూ, 70 సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసి కళ్ళు సినిమాతో ప్రాచుర్యం పొందిన ఎంవి.రఘుకు విశాఖతో ఉన్న అనుబంధం వివరించారు. అనంతరం రఘు మాట్లాడుతూ కళ్ళు సినిమా వైజాగ్‌లోనే తీసామని, 30 ఏళ్ళ గడిచినా నేటికీ ఆ చిత్రం గురించి మాట్లాడుకోవడం.ఆనందంగా ఉందన్నారు. యువత ముందుకు వచ్చి సినిమాలు తీయడం, అవి ప్రేక్షకాదరణ పొందడం ఆనందంగా ఉందన్నారు. ఇటీవల అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు అవార్డు, ఆర్ఆర్ఆర్ పాటకు ఆస్కార్ అవార్డ్ రావడం అభినందనీయమన్నారు.

విశాఖలో సినిమా అభివృద్ధికి అనువైన పరిస్థితులున్నాయని, ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. .ప్రేక్షకుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా రఘును సత్కరించారు సమావేశంలో శ్రీమన్నారాయణ, హుస్సేన్, ఛాట్ల బాబూరావు, బి చిన్నారావు, ఉషారాణి పాల్గొన్నారు

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి



ఆర్‌బికె సందర్శనలో కేంద్ర అధికారి హర్విందర్‌సింగ్

ప్రజాశక్తి -ఆనందపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఎరువుల సరఫరా నియంత్రణ అధికారి హర్విందర్‌సింగ్ అన్నారు. శనివారం వేములవలస రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులను కలిసి ఆర్‌బికె సేవలను అడిగి తెలుసుకున్నారు. నేరుగా కియోస్కో ద్వారా రైతులు ఎరువులను బుక్ చేసుకుని కొనుగోలు చేసుకోవాలని సూచించారు.ఈక్రాప్ బుకింగ్‌విధానం, కస్టమర్స్ హైరింగ్ కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాలను అద్దెకు ఇవ్వడం వంటి విషయాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బి విజయప్రసాద్, ఎఒ సంధ్యారత్నం ప్రభ, అహ్మద్ గౌస్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ కృషి మరువలేనిది

గాజువాక: బిహెచ్‌పివిని భెల్‌లో విలీనం చేయడంలో రాజశేఖరరెడ్డికృషి మరువలేనిదని ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి వి. బాబురావు అన్నారు. ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయంలో వైసిపి నేత ఎన్ నవీన్ కుమార్ అధ్యక్షతన రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సభ జరిగింది. ఐఎన్‌టియుసిప్రధాన కార్యదర్శి, వి బాబురావు, సిఐటియు ప్రధాన కార్యదర్శి, జిటిపి ప్రకాష్, ఎస్ఎం సుభాని, ఐ. ప్రసన్నకుమార్, వి ఆనందరావు, పి అప్పారావు. రామకృష్ణ, పి ఆనంద్ కుమార్, హనుమాన్, పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఎదురుగా సెంట్రల్ పార్క్ వద్ద ఉన్న నైట్ ఫుడ్ కోర్ట్‌ను తక్షణం ఖాళీ చేయాలని జివిఎంసి అధికారులు నోటీసు జారీ చేయడంపై అక్కడి చిరు వ్యాపారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫుడ్ కోర్టు వ్యాపారుల సంఘం అధ్యక్షులు నర్సింగ్ మీడియాతో మాట్లాడారు. జీవనోపాధి అయిన దుకాణాలను తక్షణం ఖాళీ చేసి ఎలా బతకగలమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు అన్యాయం చేస్తే జివిఎంసి కార్యాలయం ఎదుట తమ సంఘం తరపున పెద్ద ఎత్తున ఆందోళనకు దిగకతప్పదని హెచ్చరించారు. ఎ.సింహాచలం పాల్గొన్నారు.

త్వరితగతిన చెరువుల ఆధునికీకరణ



కొమ్మాది చెరువు ఆధునికీకరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి -పిఎం పాలెం: చెరువుల ఆధునికీకరణ పనులు త్వరితగతిన చేపట్టాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా రెండవ జోన్‌లోని కొమ్మది చెరువును పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో చేపడుతున్న చెరువుల ఆధునికీకరణ పనుల్లో భాగంగా కొమ్మాది చెరువును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. చెరువు చుట్టూ ప్రహరీ, పటిష్టమైన గట్టు ఏర్పాటు, పచ్చదనం, లైటింగ్, చెరువులోనూ, చెరువుకు నీరు చేరే కాలువలలో పూడికలు, అడ్డంకులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. రహదారి వైపున్న ఫుట్‌పాత్ ఇంటర్ లాకింగ్ సిస్టం ఏర్పాటు చేసి ప్రజలు సేద తీరేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. చెరువును ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని మ్యాపింగ్ చేసి పార్కుగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువు పరిసరాల్లో చుట్టుపక్కలా అపారిశుధ్యం ఉండడంపై వార్డు సచివాలయ కార్యదర్శిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం అతనిపై చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మిని ఆదేశించారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీరు రవి, శ్యాంసన్ రాజు, అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ అధికారి చంద్రకాంత్, ఇంజనీరింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు శనివారం ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.



పరవాడలో పవన్ జన్మదిన వేడుకల్లో పంచకర్ల

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

మధురవాడ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు శనివారం ఎండాడ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ కేక్ కట్ చేశారు. లైఫ్ ఫెయిర్ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. మిథిలాపురి వుడాకాలనీ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు నాటారు. మధురవాడ ఎస్‌సి హాస్టల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. బివి కృష్ణయ్య, చంద్రరావు, ఎన్. ఎన్.నాయుడు శాఖరి శ్రీను బాబు, పిళ్లా శ్రీను, పోతిన తిరుమల రావు, పేకేటి శ్రీను,జగుపల్లి నాని, నక్క శ్రీధర్ పాల్గొన్నారు.

తగరపువలస: పవన్ కల్యాణ్ జన్మదిన సందర్భంగా టి నగరపాలెంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ అన్నదాన శిబిరం నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పంచకర్ల సందీప్, శ్రీనుబాబు, కృష్ణయ్య, చంద్రరావు, పరిమి భువనేశ్వర్, ఇద్దిపిల్లి నానాజీ, రాజగిరి సురేష్ కుమార్, పి కొండబాబు,క్రి వెంకటేష్ పాల్గొన్నారు

తాళ్ళ వలసలో వుయ్ కేర్ సంస్థ పిల్లలకు కొంత మంది డివీస్ ఉద్యోగ మిత్రులతో కలిసి భోజనాలు పెట్టారు పార్టీ నాయకులు అప్పల స్వామికేక్ కట్ చేశారు. జివిఎంసిఒకటో వార్డు ఎస్‌సి బాలికల హాస్టల్ విద్యార్థినులకు నవిరి రాజు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు,పెన్సిల్స్ అందజేశారు

పద్మనాభం.: పవన్ జన్మదినం సందర్భంగా అయినాడ గ్రామ కమిటీ అధ్యక్షుడు కురిమిన రామస్వామి నాయుడు ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేశారు. మండల నాయకులు. జె సంతోష్, పి రాము, కె రాంబాబు, త్రినాథ్ పాల్గొన్నారు.

ఆనందపురం : పవన్‌కల్యాణ్ జన్మదిన సందర్భంగా ఆనందపురం జంక్షన్ రూరల్ పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 50మంది యువకులు రక్తదానం చేశారు, బర్రడే కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. వెల్లంకిలో 100మంది మహిళలకు సందీప్ చీరలను పంపిణీ చేశారు.బంటుపల్లిలో డాక్టర్ పిన్నింటి సన్యాసిరావు ఆధ్వర్యంలో మిఠాయిలు పంచిపెట్టారు.

పెందుర్తి :88వ వార్డు నరవ రెల్లి పేటలో జనార్ధన శ్రీకాంత్ వబ్బిన ఆధ్వర్యంలో జనసేన ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ కేక్ కటింగ్ చేశారు. 500 రెల్లి కుటుంబ సభ్యులకు, భవన నిర్మాణ కార్మికులకు సామూహిక భోజనాలు పెట్టారు. నాయకులు గల్లా శ్రీనివాస్, మామిడి శంకర్రావు, సేనాపతి శేఖర్, సబ్బవరపు రవి కనకరాజు స్వామాట్, సురేష్ శ్రీనివాస్ అప్పారావు శంకర్రావు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. లంకెలపాలెం జయ ఫంక్షన్ హాల్‌లో మాజీ కార్పొరేటర్ దుల్ల రామునాయుడు ఆధ్వర్యాన కేక్ కట్ చేసి, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. మడకపాలెంలో మడక రమణ, రావాడ పంచాయతీ ధర్మారాయుడిపేటలో సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, ఈ.బోనంగిలో బుగిడి రామ గోవిందరావు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాలను, పరవాడలో చుక్క నాగు ఆధ్వర్యాన వృద్ధులు, వికలాంగులకు సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. సాలాపువానిపాలెంలో సాలాపు శివ, తాడిలో గొల్లవిల్లి అచ్చిబాబు ఆధ్వర్యాన చీరలు పంపిణీ చేశారు. తానాంలో సర్దార్ గబ్బర్ శ్రీను ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితుడికి చెక్కు అందజేశారు. పెదముసిడివాడ పంచాయతీలో బలిరెడ్డి అప్పారావు ఆధ్వర్యాన పేదలకు, గృహనిర్మాణ కార్మికులకు నిత్యవసరాలు పంపిణీ చేశారు.

కశింకోట : స్థానిక నూకాంబిక ఫంక్షన్‌హాల్‌లో జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు బుదిరెడ్డి చిన్న గల్లా కొండలరావు, పావాడ కామరాజు ఉత్తడ రామరాజు పాల్గొన్నారు.

యలమంచిలి : పట్టణ కన్వీనర్ బొద్దపు శ్రీను ఆధ్వర్యంలో కొక్కిరాపల్లి ప్రేమసమాజం అనాధలకు జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్,పళ్లు, ఆహారం పంచారు. సిహెచ్‌సిలో పళ్ళు , పాలు, రొట్టెలు పంచారు. ధర్మవరంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 100 మంది రక్తదానం చేశారు.సోమునాయుడు, లోవరాజు, రాజు, కొఠారు నరేష్, కొఠారు శేషు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక సర్వకామదాంబ పార్క్ జంక్షన్ వద్ద భవన నిర్మాణ కార్మికులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ ఆసుపత్రిలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. ఉషా ప్రైమ్ ఆసుపత్రిలో రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో రక్త దానం నిర్వహించారు. ఇచ్చా ఫౌండేషన్‌లో వికలాంగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. నెహ్రూ చౌక్ జంక్షన్, తుమ్మపాలలో చీరలు పంపిణీ చేశారు. తాడి రామకృష్ణ, దూలం గోపి, మళ్ల శ్రీను, శ్రీరాందాస్ గోవింద్ పాల్గొన్నారు.

వడ్డాది : జనసేన పార్టీ మండల అధ్యక్షుడు డివిఎస్ నాయుడు ఆధ్వర్యంలో వడ్డాదిలో పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు కేకు కట్ చేసి వికలాంగులకు, పేదలకు పళ్ళు, స్వీట్లు,నిత్యవసరాలు అందించారు. తుమ్మ పాల రమేష్, ఎడ్ల రామ్మూర్తి, దొండా సాయి పాల్గొన్నారు.

చీడికాడ: జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పెదగోగాడలోపిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అప్పలరాజుపురంలో లలిత దేవి వృద్ధాశ్రమంలో ఉన్న దుప్పట్లు, పండ్లు అంద చేశారు. జి.వి.మూర్తి, మజ్జి కృష్ణ, గుమ్మడి సంతోష్, ప్రసాద్,గుమ్మడి శ్రీరామ్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: తిమ్మాపురం, సర్వసిద్ధి గ్రామాలలో జనసేన నాయకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం చేపట్టారు. సర్వసిద్ధి గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివకుమారి కేక్ కటింగ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటారు. గోకులపాడు గ్రామంలో మత్తి కార్తీక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.ఎంపియుపి స్కూల్లో బిస్కెట్ ప్యాకెట్స్, చాక్లెట్స్, పంపిణీ చేశారు. నియోజకవర్గ సీనియర్ నాయకులు గద్దం బుజ్జి, రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్త, మండల ఎస్కే రంగనాథ్, నక్కా శ్రీనివాసు, కోలపాటి బాబ్జి, లింగంపల్లి జ్యోతి కుమార్, పిల్లి నాగేష్ పాల్గొన్నారు

ప్రత్యేక న్యాయస్థానం ఎపిపిగా గోవిందరావు


ఇంజరాన గోవిందరావు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది ఇంజరాన గోవిందరావు నగరంలోని ప్రధాన మెట్రోపాలిటీ సెషన్స్ కోర్టుతో పాటు గంజాయి, మత్తు మందు లు అక్రమ రవాణా నిషేధిత చట్టం కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్గా నియమితు లయ్యారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. మాదకద్రవ్యాలు, గంజాయి నిషేధిత మత్తు మందులకు సంబంధించిన కేసులకు ఎపిపిగా గోవిందరావు వ్యవహరిస్తారు. ఆయన నియామకం పట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్ కృష్ణమోహన్, బైపా అరుణ్‌కుమార్, పి నర్సింగరావు, ఉపాధ్యక్షుడు రామజోగేశ్వరరావు, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షురాలు బిఎస్ లత, సీనియర్ న్యాయవాదులు ఎం రవి, శ్రీనివాసమూర్తి, కెవి రామ్మూర్తి, బగాది తులసీదాస్ అభినందించారు.

మల్లేశ్వరి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని ఆర్యపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు ఉసిరికల మల్లేశ్వరి సేవలు మరువలేనివని ఎంపిపి కె.రాంబాబు అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన టీచర్ మల్లీశ్వరిని శనివారం పాఠశాలలో యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

పాఠశాల కమిటీ, సహచర ఉపాధ్యాయులతో మార్గదర్శకంగా నడుచుకుని, విద్యార్థులకు సులువైన పద్ధతిలో విద్యాబోధన చేసిన మల్లేశ్వరిని మిగతా ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. హెచ్ఎం వి.శంకరరావు, పాఠశాల కమిటీ సభ్యులు ఎం.అప్పారావు, ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్న నిత్యాన్నదానానికి రూ.1,00,116 వితరణ

ప్రజాశక్తి- సింహాచలం: సింహాచల దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ప్రసాదానికి హైదరాబాద్‌కు చెందిన వెంకటరమణ రామలక్ష్మి దంపతులు రూ.లక్ష 116 రూపాయలు విరాళాన్ని అన్నదానం సూపరింటెండెంట్ పాలూరు నరసింహారావుకు శనివారంఅందజేశారు. ఈ సందర్భంగా విరాళదాతలకు ఆలయంలో ప్రత్యేక దర్శనాన్ని కల్పించి,తీర్థప్రసాదాలను అందజేశారు. విరాళమొత్తానికి బాండ్‌ను అందజేశారు.

26వ వార్డులో గడపగడపకూ..


సంక్షేమ పథకాల బ్రోచర్ ఇస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు రామకృష్ణ నగర్-2 సచివాలయం ఎన్జీవోస్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు వార్డు వైసిపి ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డైరెక్టర్ పాండవ శ్రీను, వార్డు నాయకులు రేవాతిరావు, అమ్మాజీ, శేషు, నవాబ్, యం సునీల్ ,బాబ్ జాన్, అనురాగ్, హరి, ఫారుఖ్, రోయ్, పాల్, గణేష్, కృప, ం బోగవల్లి గోవింద్, కె.చిన్నా, ముప్పల సంతోష్, సారిపిల్లి సంతోష్, వెంకటేష్, శ్రావణ్, నేపాల్ శ్రీను, మహదాశ్య గోపిపాల్గొన్నారు.

ఆదిత్య విజయం



చంద్రయాన్-3 విజయోత్సాహంతో సూర్యునిపై ప్రయోగానికి ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. పిఎస్ఎల్వి -సి57 ఉపగ్రహవాహక నౌక ద్వారా ఆదిత్య ఎల్1 ఉపగ్రహాన్ని తిరుపతి జిల్లాలోని షార్ కేంద్రం నుంచి విజయవంతంగా ప్రయోగించారు. రాకెట్ నుంచి వేరై, నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టబడిన ఈ ఉపగ్రహం, నాలుగు నెలలపాటు భానుడి వైపు ప్రయాణించి, భూమికి 15లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్1, లంగ్రాజ్ పాయింట్‌లోకి చేరుకుని, సూర్యుని వెలుపల ఉన్న ఫోటోస్పియర్, క్రోమోస్పియర్‌తోపాటు వెలుపల ఉన్న కరోనాను అధ్యయనం చేయనుంది. సౌర తుఫానుల నుంచి అంతరిక్షంలోని ఆస్తుల పరిరక్షణకు వీలుగా సౌరజ్వాలలు, రేణువులు, అక్కడి వాతావరణంపై నిరంతరం, నిరాటంకంగా అధ్యయనం చేసి, పరిశోధనలు జరిపి, నిమిషానికొక ఫొటోను భూమికి పంపనుంది. ఆదిత్య ఎల్1 ప్రయోగం మొదటిదశ విజయవంతంగా పూర్తిచేసిన ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఆదిత్య-ఎల్1 సక్సెస్‌తో ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసల వెల్లువ

ఇస్రో శాస్త్రవేత్తల కృషి గొప్పది



సూర్యునిపై పరిశోధనలే లక్ష్యంగా రూపుదిద్దుకున్న ఆదిత్య ఎల్ 1, ఉప గ్రహం నింగిలోకి విజయ వంతంగా దూసుకెళ్ల డంలో ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఎంతో గొప్పదనే చెప్పాలి. ఈ తరహా కృషి భారత దేశ కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తంగామరింతగా ఇనుమడింప జేస్తాయనడంలో ఏమాత్రం సందేహం లేదు

జయంతి రాధాకుమారి, హెచ్ఎం
జివిఎంసి హైస్కూల్, రాయిపాలెం

భారత్ కీర్తిప్రతిష్టలు విశ్వవ్యాప్తం



వరుస విజయాలతో దూసుకుపోతున్న ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఫలితంగా భారతదేశ కీర్తి ప్రతిష్టలు దశ దిశలా వ్యాపించాయి. చంద్రుని దక్షిణ ధృవంపై అడుగిడిన విజయోత్సా హంతో ఆదిత్యునిపై పరిశోధనలకు సిద్ధం కావడం, మొదటి మెట్టు విజయవంతంగా పూర్తిచేయడం అభినందనీయం.

పొట్నూరు మురళీ మోహనరావు, హెచ్ఎం
జెడ్‌పి హైస్కూల్, చిట్టివలస

ప్రపంచదేశాల చూపు మన వైపు



ఆదిత్య ఎల్-1 ఉపగ్రహం విజయవంతం అద్భుతమైన అనుభూతి. భారత వైజ్ఞానిక సత్తా ప్రదర్శనకు ఇదొక మధుర జ్ఞాపకం. హ్యాట్రిక్ విజయంతో ప్రపంచ దేశాలన్నీ మన వైపు చూసేలా ఇస్రో శాస్త్రవేత్తలు సత్తా చాటారు.

పోతిన లీలావర్ధన్, విద్యార్థి, డిగ్రీ ఫైనలియర్, పిఎం పాలెం.

గర్వించదగ్గ విషయం



చంద్రయాన్-3 అద్భుత విజయంతో పులకించిన భారతావని, ఇంకా ఆ అనుభూతి లోనే ఉండగానే, ఆదిత్య ఎల్-1 ప్రయోగం విజయవంతం కావడం భారత దేశ పౌరులం దరూ గర్వించదగ్గ విషయం. ఇస్రో శాస్త్రవేత్తలు దేశ ఖ్యాతిని చాటారు. సత్తా చూపారు.

కె.ఉదయ్ కుమార్, బిఎస్‌సి విద్యార్థి, పిఎం.పాలెం

వైద్య ఆరోగ్యరంగంలో సంస్కరణలు అవసరం

ఐపిహెచ్ఎ వార్షిక సమావేశాలలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్


సావనీర్ ఆవిష్కరణలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి- మధురవాడ : సామాన్యుడికి ఆర్థిక భారంలేని వైద్యానికి అవసరమైన సంస్కరణలు దేశంలోని వైద్య ఆరోగ్య రంగంలో జరగాలని, దీనికి అవసరమైన నిధులు కేటాయించాలని గీతం అధ్యక్షుడు ఎం. శ్రీభరత్ అన్నారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్(జిమ్సర్) సామాజిక వైద్యవిభాగం ఆతిథ్యంలో ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ 28వ వార్షిక సమావేశాలలో మాట్లాడుతూ, దేశం. ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్నా, వైద్య ఆరోగ్య రంగంపై కేవలం 6 శాతం నిధులే కేటాయించడాన్ని బట్టి, గత అనుభవాల నుంచి ఇంకా పాఠాలు నేర్చుకోలేదనేది స్పష్టమౌతోందన్నారు. ప్రివెంటివ్ కేర్‌పై పరిశోధనలు అవసరమని,. కేన్సర్ వంటి మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించి నివారించగలిగితే ప్రజలకు, ప్రభుత్వాలకు అనవసర వ్యయం తగ్గుతుందన్నారు.

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నిపుణురాలు ప్రొఫెసర్ ఆర్.మధుబాల మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 2030 అభివృద్ధి లక్ష్యాలలో అందరికి సంపూర్ణ ఆరోగ్యం ఒకటన్నారు. వైద్య రంగంలో నిపుణుల సంఖ్యను పెంచడం, డిజిటల్ మాధ్యమాలను ఉపయోగించి మారుమూల ప్రాంతాలకు వైద్యసాయం అందించడం, పోషకాహారం లోపం, శిశుమరణాలను నియంత్రించడం తక్షణ అవసరమన్నారు. ఔషధాలు, వ్యాక్సిన్ రంగంలో ప్రపంచానికి మార్గం చూపిన భారత్, వైద్య ఆరోగ్య రంగంలోనూ ఇతరదేశాలకు ఆదర్శంగా నిలవాలన్నారు.

విచ్చలవిడి వ్యాక్సిన్‌లపై నియంత్రణ అవసరం

వార్షికోత్సవాల్లో భాగంగా స్వర్గీయ డాక్టర్ బి.రామమూర్తి స్మారక ఉపన్యాసాన్ని చేసిన న్యూఢిల్లీ ఎయిమ్స్‌లోని సెంటర్ ఫర్ కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ కె.రాయ్ మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి ప్రపంచదేశాలకు ఎన్నో పాఠాలు నేర్పిందన్నారు. కోవిడ్ నివారణకు 349 వ్యాక్సిన్‌లు ప్రయోగదశలో ఉంటే, వాటిలో 37 మాత్రమే అనుమతులు పొందాయన్నారు. ఐతే వ్యాక్సిన్లు మరణాల సంఖ్యను నియంత్రించాయే తప్ప, వైరస్ వ్యాప్తిని అరికట్టలేకపోయాయని పలు పరిశోధనలలో వెల్లడైందన్నారు. సహజసిద్ధంగా ఉండే వ్యాధినిరోధకశక్తి మాత్రమే వైరస్‌లను నియంత్రించగలదన్నారు. విచ్చలవిడిగా వ్యాక్సిన్లను వాడటం సరికాదని, వాటివల్ల దీర్ఘకాలంలో దుష్పరిణామాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, జిమ్సర్ ప్రొ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి పద్మజ, సమావేశాల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎన్.జి.నాగమణి, సంయుక్త కారదర్శి డాక్టర్ జి.చైతన్య, ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అప్పలనాయుడు, కార్యదర్శి పి.జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజ్ఞానశాస్త్ర విజయాలకు గౌరవమివ్వాలి

ప్రజాశక్తి- మాధవధార : విజ్ఞానశాస్త్రం సాధించిన విజయాలకు మనమంతా గౌరవమివ్వాలని ఎపి రాష్ట్ర కాంగ్రెస్ ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు అన్నారు. చంద్రయాన్-3 విజయం భారతీయులందరిదని, దీన్ని పాఠశాలల్లో పాఠ్యాంశంగా బోధించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రోదసీ సైన్స్‌కు పునాదులు వేసిన హోమీబాబా, విక్రం సారాభాయ్ వంటి ప్రముఖుల జీవితాలను విద్యార్థిదశనుంచే పిల్లలకు తెలియజెప్పాలని, పాఠశాలల్లో సైంటిఫిక్ టెంపర్ అనే అంశంపై చిన్నారులలో అవగాహన, ఆసక్తి కలిగించడానికి అనువైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైన్స్ విజయాలకు మతం రంగు పులమడం మానేయాలని హితవు పలికారు. ప్రజా ప్రయోజనాలకు అవసరమైన మరిన్ని ప్రయోగాలను ఇస్రో చేపట్టాలని, అవి విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

వైసిపి జిల్లా కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ :మధురవాడ ఎన్‌విపి న్యాయకళాశాల సమీపంలోని శ్రీరామా ప్రాపర్టీస్ వద్ద వైసిపి జిల్లా నూతన కార్యాలయ భవనాన్ని శనివారం రాష్ట్రమంత్రి గుడివాడ అమరనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్ మాట్లాడుతూ, ప్రస్తుతం మంచిరోజులు కావడంతో అసంపూర్తిగా ఉన్నప్పటికీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించామని, ఇకనుంచి పార్టీ జిల్లా కార్యకలాపాలు ఇక్కడినుంచే సాగుతాయన్నారు. మిగతా పనులు తొందరలోనే పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలోని 26జిల్లాల్లోనూ వైసిపి కార్యాలయాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. విశాఖలోనే మొట్టమొదటి కార్యాలయాన్ని పూర్తి చేసుకున్నామని, రానున్న ఎన్నికల్లోనూ విజయాల్లో విశాఖ జిల్లా వైసిపి ముందుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదానశిబిరం ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎస్‌కె రెహమాన్, తిప్పల గురుమూర్తిరెడ్డి, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు, పలువురు కార్పొరేటర్లు, నేతలు పాల్గొన్నారు.

జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా చంద్రమౌళి


గొంప చంద్రమౌళి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా గొంప చంద్రమౌళి ఎన్నికయ్యారు. అసోసియేషన్ కార్యవర్గ (2023-2025) ఎన్నికలు శనివారం జరిగాయి. రొంగలి జగన్నాథం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేషన్ చైర్మన్‌గా రొంగలి జగన్నాథం, గౌరవ అధ్యక్షునిగా వి.సత్యనారాయణ, కన్వీనర్‌గా రాజాన వెంకటరావు, ఆడిటర్‌గా ఎస్.రవీంద్రనాథ్, అధ్యక్షునిగా గొంప చంద్రమౌళి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రంధి సాధురావు, కోశాధికారిగా ఆర్.నరసింగరావు, తదితరులు ఉన్నారు.

అధిక ధరలు, విద్యుత్ భారాలు తగ్గించాల్సిందే

కొనసాగిన సిపిఎం నిరసనలు


సబ్బవరంలో వినతిపత్రం ఇస్తున్న ప్రభావతి తదితరులు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

అధిక ధరలు, విద్యుత్ ఛార్జీల భారాలను రద్దు చేయాలని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అనకాపల్లి, విశాఖ జిల్లాలోని పలు గ్రామ/ వార్డు సచివాలయాల వద్ద శనివారం రెండో రోజూ ధర్నాలు జరిగాయి. విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. అనంతరం సచివాలయాల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

సబ్బవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు ఛార్జీల భారం వెంటనే తగ్గించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్బవరం-1, పైడివాడ అగ్రహారం, వంగలి, అమ్ములపాలెం సచివాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టి పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, నాయకులు పప్పుల కోటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, మొల్లేటి గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

పరవాడ : మండలం పి.బోనంగి పంచాయతీ కార్యాలయం సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు పి.మాణిక్యం మాట్లాడుతూ భారీగా పెంచిన వంటగ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, రమణమ్మ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, నరసమ్మ, ముసలయ్య పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని కొత్తపట్నం, వాడనర్సాపురం, జెడ్.చింతవా గ్రామ సచివాలయాల్లో సిపిఎం నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేముడునాయుడు మాట్లాడుతూ దేశంలోనూ రాష్ట్రంలోనూ చదువుకున్న నిరుద్యోగులు లక్షల సంఖ్యలో ఉన్నప్పటికీ ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చెల్లూరి నూకన్న, చొడిపల్లి అప్పలరాజు, సిహెచ్ నాగరాజు, మేరీ ఆంధ్రయ, ఎరిపెల్లి రాము, కర్రి శ్రీను పాల్గొన్నారు.

చోడవరం : సిపిఎం ఆధ్వర్యంలో వెంకన్నపాలెం గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎన్వి.నాయుడు మాట్లాడుతూ ఏటా రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జోగారావు రాజు, శ్రీనివాసు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని సంతపాలెం, ఆర్వై.అగ్రహారం గ్రామ సచివాలయాల్లో పంచాయితీ కార్యదర్శులకు సిపిఎం నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దని, చౌక్ డిపోల ద్వారా 14 రకాలు నిత్యవసర వస్తువులు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గండి నాయన బాబు, ఎర్ర దేవుడు, గొగాడ ఈశ్వరమ్మ, ఎ.రామలక్ష్మి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

తగరపువలస : పెరిగిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వార్డు సచివాలయం వద్ద విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. పార్టీ జోన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు మాట్లాడుతూ సామాన్యులను ఇబ్బందులకు గురిచేసే ఛార్జీలు, ధరాభారం తగ్గించ కుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొన్నారు

పిఎం పాలెం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సిపిఎం మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆరో వార్డు కొమ్మాది 37వ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు.విద్యుత్ బిల్లులను దహనం చేశారు సిపిఎం జోన్ కార్యదర్శి డి అప్పలరాజు, నాయకులు సియ్యాద్రి పైడితల్లి,బి పండా విజయ్, డి తులసి, ఎస్ నర్సయ్యమ్మ, ఎస్ గురుమూర్తి, జి.సత్యం పాల్గొన్నారు.

గాజువాక.: విద్యుత్ ఛార్జీలు పెంపును నిరసిస్తూ సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు ఆధ్వర్యంలో చిన్న గంట్యాడ, దశమకొండ, బీసీ రోడ్ సచివాలయాల వద్ద కరెంటు బిల్లులను తగలబెట్టారు. కార్యక్రమంలో పి. నర్సింగరావు, పి నాగేశ్వరరావు, కెపి.కుమార్, వై లక్ష్మణ్, యశోద రాణి కామేశ్వరి స్వర్ణలత పాల్గొన్నారు.

ములగాడ: జివిఎంసి 63వ వార్డు క్రాంతినగర్, కాకరలోవ చింతలోవ సచివాలయాల వద్ద సిపిఎం మల్కాపురంజోన్ కార్యదర్శి పి.పైడిరాజు, జోన్ నాయకులు కె.పెంటారావు ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించేవరకు పోరాటం ఆగదని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పన, నిత్యావసరాల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోన్ నాయకులు ఎం.జయలక్ష్మి, వై.కల్యాణి, రాధ, దొడ్డమ్మ, పద్మ, పి.సూర్యనారాయణ, ఎస్.వాసు, ఈశ్వరరావు, జి.రమా, చింతల్లోవ పి.పైడిరాజు, ఎస్ రాజు, పి.లక్ష్మి ఎ.రాహుల్, డి.హరి, బాలు,పి.శ్రీను పాల్గొన్నారు

కలెక్టరేట్ : సిపిఎం, ఐద్వా పంది మెట్ట కమిటీ ఆధ్వర్యంలో పంది మెట్ట జంక్షన్‌లో విద్యుత్ బిల్లులు తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఐద్వా జగదాంబ జోన్ అధ్యక్షురాలు కె.మణి మాట్లాడారు. నాయకులు సత్యవతి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రాము

4న ధర్నాలను విజయవంతం చేయాలని ప్రచారం

అచ్యుతాపురం : ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళటానికి ఈ నెల 4న సోమవారం మండల తహశీల్దారు కార్యాలయాల వద్ద జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం అచ్యుతాపురం డివిజన్ కన్వీనర్ ఆర్ రాము పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, శ్రీకాంత్, రామునాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : అధిక ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 4న మండల కార్యాలయం వద్ద శనివారం చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం మురా కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమం సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శంకర్రావు, నాయకులు బి రాజు, అప్పలరాజు, కళ్యాణం, శంకర్, సత్తిబాబు పాల్గొన్నారు.


పి.బోనంగిలో ధర్నా చేస్తున్న ప్రజలు


మల్కాపురం పరిధిలో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు, మహిళలు




తగరపువలసలో విద్యుత్ బిల్లులు దగ్ధం చేస్తున్న దృశ్యం


గాజువాక ప్రాంతంలో విద్యుత్ బిల్లులు దగ్ధం

ఆధునిక పరిజ్ఞానంతో చెరుకు పంటకు పూర్వ వైభవం

ప్రజాశక్తి- అనకాపల్లి : చెరుకు పంటల పూర్వ వైభవానికి ఆధునిక పరిజ్ఞానమే శరణ్యమని వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె జగన్నాథరావు అన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం రైతులు, శాస్త్రవేత్తలు ముఖాముఖి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరకు రైతు ఉత్పత్తి వ్యయం పెరిగి, దిగుబడులు తగ్గి అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాడని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యాంత్రీకరణ, సమగ్ర పోషక, సమగ్ర సస్యరక్షణ యాజమాన్యం పద్ధతులు అనుసరించాలన్నారు. బెల్లం పొడి, బెల్లం ముక్కలు, బెల్లం తేనె, చాక్లెట్లు, బిస్కెట్లు రసం వంటి బెల్లం ఆధారిత ఉత్పత్తుల ద్వారా చెరకును లాభసాటి పంటగా చేసుకోవచ్చని తెలిపారు. ఆర్ఏఆర్ఎస్ చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ చెరకు వైల్డిని తట్టుకునే వంగడాలను రైతుల ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో సుగర్ కేన్ అసిస్టెంట్ కమిషనర్ లోకేష్, చోడవరం సుగర్ ఫ్యాక్టరీ సిడిఓ రామన్, శాస్త్రవేత్తలు విశాలాక్షి, ముకుందరావు, శ్రీదేవి, సీతాలక్ష్మి. గౌరీ చంద్రశేఖర్ ఉమామహేశ్వరరావు, కుసుమ రాజేంద్రప్రసాద్, రైతులు, శక్తిమాన్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

లోక్ అదాలత్, రౌడీ షీటర్ కేసులపై సమీక్ష

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలోని వివిధ క్రిమినల్ కేసుల్లో నిందితులుగా ఉన్న రౌడీషీటర్ల కేసులను, లోక్ ఆదాలత్ కేసులను ఎస్పీ కె.వి.మురళీకృష్ణ శనివారం పోలీస్ అధికారులతో ఎస్పీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రౌడీ షీట్ తెరవడానికి అవకాశాలున్న వ్యక్తులను గుర్తించాలని సూచించారు. కేసులు దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసి కోర్టులో నేరాభియోగపత్రాలు సమర్పించి నిందితులకు బెయిల్ రాకుండా చూడాలని, బెయిల్‌పై ఉండి మరల నేరానికి పాల్పడితే బెయిల్ రద్దుకు స్థానిక కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. కఠిన శిక్షలు త్వరితగతన పడేవిధంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో అనుసంధానమై పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. హత్య, అత్యాయత్నం, శారీరక గాయాలు కలిగించడం, భయపెట్టడం, దోపిడీలు చేయడం, మద్యం సేవించి గొడవలు చేయడం తదితర నేరాల్లో చురుకుగా ఉన్న రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. రౌడీ షీటర్ల ఇళ్లను రాత్రి గస్తీ తిరిగే పోలీసులు తనిఖీ నిర్వహించి వారు ఉన్నదీ లేనిదీ తెలుసుకొని తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 9వ తేదీన లోక్ అదాలత్ సందర్భంగా ఇరుపార్టీలు స్వచ్ఛందంగా రాజీకి వచ్చే విధంగా చర్యలు తీసుకొని, ఎక్కువ ఐపీసీ కేసులు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, డిటిసి డిఎస్పి పి.శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, జిల్లావ్యాప్తంగా డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పి మురళీకృష్ణ

రుణాలపై పాడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి -కశింకోట

పాడి రైతులకు రుణాలపై అవగాహన కార్యక్రమం మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా పశువైద్య అధికారి డాక్టర్ దయానా మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ ద్వారా రుణం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. డిసిసిబి బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.

అమ్మ ఛారిటబుల్ ట్రస్టుకు ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - పరవాడ : శంకర్ ఫౌండేషన్ యాజమాన్యం అమ్మ ఛారిటబుల్ ట్రస్టుకు శనివారం ప్రతిభా పురస్కారం అందజేసింది. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం జరిగింది. 2022-23 సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహణలో ఉత్తమ సేవలు అందించడంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్‌కి ద్వితీయ స్థానం లభించింది. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ ప్రతిభా పురస్కారాన్ని హాస్పిటల్ జీఎమ్ రాధాకృష్ణన్ చేతులు మీదుగా అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ గొంప వెంకటరావు మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ వారు ప్రతిభా పురస్కారాన్ని ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో తమ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. ప్రతిభా పురస్కారాన్ని అందించిన శంకర్ ఫౌండేషన్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు లెక్కల సత్యనారాయణ మాస్టర్, సింగంపల్లి అర్జున, క్యాంప్ డిప్యూటీ మేనేజర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



అమ్మ ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులకు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

'పిఎం విశ్వకర్మ యోజన'పై అవగాహన

ఎన్‌టిపిసి యాజమాన్యం జారీ చేసిన

సర్క్యులర్‌ను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - పరవాడ

ఎన్‌టిపిసి కాంట్రాక్ట్ కార్మికులకు ప్లాంట్ లోపలకు స్మార్ట్ ఫోన్ల అనుమతిని నిరాకరిస్తూ యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలని ఎన్‌టిపిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతం నుండి కార్మికుల స్మార్ట్ ఫోన్లు అనుమతించి, ఇప్పుడు అనుమతించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్‌టిపిసిలో కాంట్రాక్ట్ కార్మికులకు మరుగుదొడ్లు లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్నవి కూడా సక్రమంగా పని చేయలేవని, వాటిని బాగు చేయడానికి యాజమాన్యం దృష్టి పెట్టాలని కోరారు. ఎన్టిపిసిలో కార్మికుల సమ్మె, నిరసన చేసినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు ప్లాంట్ లోపల ఫోటోలు బయటికి రాకుండా గోప్యంగా ఉంచాలని యాజమాన్యం ప్రయత్నిస్తుందని, అందుకే స్మార్ట్ ఫోన్లకు అనుమతి నిరాకరిస్తుందని మండిపడ్డారు. పని సమయంలో వినియోగించకుండా డ్యూటీలో ఫోన్ భద్రపరుచుకునేలా చర్యలు తీసుకోవాలే గాని పూర్తిగా ఫోన్లు అనుమతించకపోవడం విచారకరమన్నారు. వెంటనే మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని, కార్మికులకు ఫోన్లు అనుమతి ఇవ్వాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

ఉద్యోగులను నమ్మించి మోసం చేసిన జగన్

ప్రజాశక్తి -అనకాపల్లి : అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న హామీని గాలికి వదిలేసి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఉద్యోగులను మోసం చేశారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నారాయణరావు, కొట్ని రామకృష్ణ విమర్శించారు. పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిపిఎస్ కోసం ఆర్డినెన్స్ తీసుకొస్తామంటూ తాజాగా ప్రకటన చేయడం దారుణమన్నారు. సిపిఎస్ మాదిరిగానే జిపిఎస్ కూడా ఉద్యోగి కాంట్రిబ్యూషన్ చెల్లించాల్సిందే కనుక ఇది కొత్త సీసాలో పాతసారా మాత్రమేనన్నారు. జిపిఎస్ ప్రకారం చివరి బేసిక్ పేలో 33శాతం గ్యారెంటీడ్ పెన్షన్‌గా చెల్లిస్తామని జగన్ రెడ్డి చెప్పడం తిరిగి సిపిఎస్ ఉద్యోగులను మోసగించడమేనని పేర్కొన్నారు. ఉద్యోగుల ఓట్లతో గెలిచిన జగన్ రెడ్డి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లాలో సుమారు 14 వేల మంది ఉపాధ్యాయుల జీతం బిల్లులు నేటికీ సమర్పించకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్రాంతి ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, కాండ్రేగుల సత్యనారాయణ, పార్టీ నాయకులు మళ్ల గణేష్, పార్టీ నాయకులు బుద్ద సోమేశ్వరరావు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో ముగిసిన వర్క్ షాప్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ వర్క్ షాప్ శనివారం ముగిసింది. వారం రోజులు పాటు ఈ.సీ.ఈ. విద్యార్థులకు జరిగిన ఈ వర్క్ షాప్ ద్వారా విద్యార్థులు సర్క్యూట్ బోర్డ్ తయారీ విధానం నేర్చుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, ఈ.సీ.ఈ విభాగాధిపతి డాక్టర్ పి. పూర్ణప్రియ, రిసోర్స్ పర్సన్ ఎం. ఉమామహేశ్వర రావు తెలిపారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ వివిధ టెక్నికల్ వర్క్ షాప్ ద్వారా విద్యార్థులు ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీ మెళ కువలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. డీన్ అకడమిక్స్ డాక్టర్ కె.పార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం సచివాలయం -2 పరిధిలో పుత్రేవు కామేశ్వరి అనకాపల్లి ఉషా ప్రైమ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వాలంటీర్ ఉషా ప్రమీల అనకాపల్లి వెళ్లి హాస్పిటల్‌లో పెన్షన్ డబ్బులు అందించింది. తాను చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వచ్చి పింఛను ఇవ్వడం ఎంతో ఆనందం కలిగించిందని కామేశ్వరి ఆనందం వ్యక్తం చేసింది.



పింఛను ఇస్తున్న వాలంటీరు

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 17న ప్రధానమంత్రిచే ప్రారంభించబడుతున్న పిఎం విశ్వకర్మ యువజన పథకం పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. ఈ విషయమై శుక్రవారం రాత్రి తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 18 సంప్రదాయ చేతివృత్తుల వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. చెక్కపని (వడ్రంగి పని, పడవలు చేయడం) ఇనుముతో పరికరాలు, బంగారు, వెండి పని, మట్టితో వస్తువులు తయారీ, చర్మకారులు, భవన నిర్మాణ పని, బుట్టలు అల్లుట, బొమ్మలు చేయుట, బార్బర్ పని, దండలు చేయుట, బట్టలు ఉతికే వారు, టైలర్లు, చేపల వలలు చేయడం తదితర పనుల వారికి ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. దరఖాస్తు చేసే నాటికి 18 సంవత్సరాలు నిండి, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నుండి గత 5 సంవత్సరాల్లో ఎటువంటి ఆర్థిక సహాయం పొందకుండా, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం లేనివారు దీనికి అర్హులని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రోజుకు రూ.500 ఉపకార వేతనంతో శిక్షణ ఇస్తారని, శిక్షణ తరువాత పరికరాల కొనుగోలుకు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందిస్తారని చెప్పారు. అలాగే మొదటి దశ రూ.1లక్ష, రెండో దఫా రూ.2 లక్షల వరకు పొందవచ్చని, ఐదు శాతం వడ్డీ రేటు ఉంటుందని వివరించారు. అర్హత కలిగిన వారు వారి నివాస ప్రాంతంలోని సచివాలయంలో పేరును రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ, నైపుణ్యాభివృద్ధి శాఖ, బీసీ ఎస్సీ వెల్ఫేర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి



సమావేశంలో పాల్గొన్న పాలకవర్గం

ఆలయ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : నూకాంబికా ఆలయ అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ ఆదేశించారు. అమ్మవారి దేవస్థానంలో శనివారం ఆలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఈవో బండారు ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఆలయం పరిశుభ్రత, అలవాట్లు, ప్లాంటేషన్, అమ్మ నామ సంకీర్తనం, సమయపాలన, పూజా విధానం, భక్తులకు సౌకర్యాల కల్పన వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. నిత్యాన్నదానం, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ, ప్రసాదం అమ్మకాలు, బయటకు ఇవ్వకుండా చూడడం, పారదర్శకంగా టికెట్స్ అమ్మకం, హుండీల ఆదాయం పెంపు, ఆదాయ వనరులు, విరాళాలు, ఖర్చుల పరిశీలన, ఖర్చుల నియంత్రణ, టాయిలెట్స్ నిర్వహణ, కళ్యాణ మండపాలు, కాటేజ్ నిర్వహణ, పైపుల మరమ్మతులు వంటి వాటిపై చర్చించారు. ఈ సమావేశంలో సభ్యులు కంటిపల్లి శోభారాణి, పీలా లక్ష్మి శ్రీనివాసు రావు, పాము అనూరాధ, మల్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమా చంద్ర మహేశ్వరి, బుద్ద నరసింగరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్రనాథ్, ఎక్స్ అఫీషియో మెంబెర్ వై.శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సమస్యపై వినతి

ప్రజాశక్తి అచ్యుతాపురం : సాగునీటి కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న దుంగలు, పిచ్చి మొక్కలను తొలగించి సాగునీటిని అందించాలని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన వెర్రి నాగేశ్వరరావు, పెదపాడు గ్రామానికి చెందిన జనపరెడ్డి సూర్యనారాయణ తదితరులు నీటిపారుదల శాఖ ఏఈకి శనివారం వినతిపత్రం అందజేశారు. కృష్ణంరాజు కాలవ ద్వారా నీరు వస్తున్నప్పటికీ పంట పొలాలకు రానీయకుండా కాలువకు అడ్డంగా దుంగలు వేయడంతో దారి మళ్లి పోతుందని రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మునగపాక, అరవపాలెం మధ్యలో కాలువకు అడ్డంగా తాటి, కొబ్బరి, పిచ్చి మొక్కలు వల్ల కాలువ ద్వారా పెదపాడు తిమ్మరాజుపేట తదితర గ్రామాలకు వెళ్లాల్సిన నీరు రావడంలేదని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి పూర్వం వల్లే నీటి ప్రవాహానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని బయ్యవరం వద్ద జాతీయ రహదారిపై శనివారం పెద్ద ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుండి రాజమండ్రి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కారులో వెళ్తున్నారు. బయ్యవరం వద్దకు వచ్చే సరికి వీరి ముందు అనకాపల్లి వైపు నుండి యలమంచిలి వైపు వెళుతున్న వాహనం సడన్‌గా బ్రేక్ వేశారు. దీంతో వీరి కారు వెనుకనుండి ఢీకొట్టింది. ఈ కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు పిల్లలు, ముగ్గురు పెద్దలు క్షేమం బయటపడ్డారు. హైవే అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలు అక్కడే నుండి తీసి వేయించారు. పేర్లు చెప్పేందుకు నిరాకరించారు.



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా తోడపెద్దు పాలుకొలుపు మహోత్సవం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మండల కేంద్రం మునగపాకలో ఆడారి ఎర్ర వెంకయ్య గారి తోడపెద్దు పాలుకొలుపు మహోత్సవం శనివారం నిర్వాహకులు ఘనంగా జరిపారు. తొమ్మిది సంవత్సరాల అనంతరం జరిగిన ఈ పాలకొలుపు శుక్రవారం రాత్రి నుండి ప్రారంభమై శనివారం ముగిసింది. పలు ప్రాంతాల నుండి 17 సింహాద్రి అప్పన్న ఎద్దులతో గ్రామంలో వీధుల గుండా సేవ గరిడీలతోను, దాసులు హరినామ కీర్తనలతో ఊరేగించారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ యు.సుకుమార్ వర్మ, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, లీడర్ పత్రిక ఎడిటర్ రమణమూర్తి పాల్గొన్నారు.

మెడిటెక్‌ను సందర్శించిన ఎంపీ

ప్రజాశక్తి -అనకాపల్లి : కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ పార్లమెంటు కమిటీతో పాటు మెడిటెక్‌ను పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతి సందర్శించారు. దేశంలో అతిపెద్ద మెడికల్ పరికరాల తయారీ విభాగం తమ ప్రాంతంలో ఉండటం తమకెంతో గర్వ కారణమని ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో గల ఏఎంటీజెడ్ భవిష్యత్తులో మరిన్ని వైద్య పరికరాలను తయారు చేయగలదని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ సత్యవతి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

ఎఐఎస్ఎఫ్ మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - యలమంచిలి : నెల్లూరులో ఈ నెల 15, 16 తేదీల్లో జరుగనున్న అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాబ్జీ, జి.ఫణీంద్రకుమార్ పిలుపునిచ్చారు. శనివారం యలమంచిలి బిసి బాలుర కళాశాల వసతి గృహంలో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై పోరాటాల కోసం మహాసభలో చర్చించి భవిష్యత్ ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనం పెట్టాలని, ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు కార్తీక్, కౌశిక్, కిరణ్, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఘనంగా జాతీయ పోషకాహార వారోత్సవాలు

ప్రజాశక్తి-పరవాడ : జాతీయ పోషకాహార వారోత్సవాలు సందర్భంగా లుపిన్ ఫార్మా కంపెనీ సిఎస్ఆర్ విభాగం లుపిన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం జివిఎంసి 85వ వార్డు మంత్రిపాలెం అంగన్వాడీ కేంద్రం ఆవరణలో పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఈ.వరలక్ష్మి, వైసిపి నాయకులు ఇల్లపు ప్రసాద్, లుపిన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సిడిపిఒ లలిత కుమారి, అడ్మిన్ ఇంచార్జ్ సబ్బవరం సెక్టార్ అనిల్ కుమార్, సిఎస్ఆర్ మేనేజర్ డి.వెంకట నారాయణ, లుపిన్ వైద్యాధికారి డాక్టర్ సురేష్ బాబు, గ్రామ పెద్దలు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సహకారంతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

రైతులు సహకరించడంతో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు గడప గడప మన ప్రభుత్వం నిధులతో రోడ్డు నిర్మాణం జరిగింది. మండలంలోని కొండెంపూడి నుండి కొల్లిమల్లపాలెం వరకు 450 మీటర్లుతో సిసి రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. గతంలో కేపీ అగ్రహారం, కొల్లిమల్లపాలెం గ్రామస్తులు రోడ్డు సదుపాయం లేక ఇబ్బంది పడేవారు. సుమారు 8 కిలోమీటర్లు చుట్టూ తిరిగి కొండెంపూడి వచ్చేవారు. ఈ విషయం స్థానిక సర్పంచ్ ఆది సత్యనారాయణ అక్కడ రైతులతో మాట్లాడి సుమారు ఒక ఎకరా వ్యవసాయ భూమి రోడ్డు నిర్మాణం కోసం సమీకరించారు. రూ.50లక్షలు విలువ చేసే భూములను రోడ్డు కోసం రైతులు ఉచితంగా ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే రూ.10లక్షలు గడప గడప నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో సర్పంచ్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్, ఇరు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే ధర్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.



పొలాల నుంచి వేసిన సిసి రోడ్డు

ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి



కశింకోటలో నివాళి అర్పిస్తున్న మంత్రి

ప్రజాశక్తి -యంత్రాంగం:**మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా అనకాపల్లి, విశాఖ జిల్లాలోని వైసిపి నేతలు ఘనంగా నివాళి అర్పించారు. వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.**

కశింకోట : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా కశింకోట జాతీయ రహదారి పక్కన ఉన్న ఆయన విగ్రహానికి మంత్రి గుడివాడ అమరనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపిఐడబ్ల్యూఎ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ కలగ లక్ష్మీ గున్నయ్య నాయుడు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి ఎన్.రమేష్, ఎంపిటిసి లగిశెట్టి భవానీ గణేష్ పాల్గొన్నారు.

అనకాపల్లి : పట్టణంలోని వన్ వే ట్రాఫిక్ జంక్షన్, బైపాస్ రోడ్డు వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎపిఐడబ్ల్యూఎ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, పట్టణ అధ్యక్షులు మందపాటి జానీ, నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుమ్మపాలలో సర్పంచు తట్టా పెంటయ్య నాయుడు, జీవీఎంసీ 84వ వార్డులో కోరుకొండ రాఘవ, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి గొర్లి సూరిబాబు రాజశేఖర్‌రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఉత్తరాంధ్ర చర్చ వేదిక నాయకులు బుద్ధ రాజేష్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతి నిర్వహించారు.

యలమంచిలి : స్థానిక బస్టాండ్ వద్ద రాజశేఖరరెడ్డి విగ్రమానికి ఎమ్మెల్యే కన్నబాబు రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోదెపు గోవింద్, మున్సిపల్ కమిషనర్ వీరయ్య, వైస్ చైర్మన్లు బెజవాడ, గుప్తా, వైసిపి నాయుకలు బొద్దపు ఎర్రయ్య దొర పాల్గొన్నారు. మండలంలోని ఏటికొప్పాకలో వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్పీటిసి సంధ్యారాము నివాళులర్పించారు.

మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లిలో వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. పేదలకు బియ్యం పంపిణీ చేశారు. స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం ఆవరణలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు పాల్గొన్నారు.

చోడవరం : స్థానిక కొత్తూరు జంక్షన్ వద్ద డీసీఎంఎస్ చైర్మన్ పళ్ళ నర్సింగరావు, గోవాడలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవక సత్యరావు, గాంధీ గ్రామంలో ఎంపీపీ గాడి కాసు వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రేమ సమాజం, ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బైన ఈశ్వరరావు, బండి శ్రీను, దేవరపల్లి సత్య, బగ్గు శ్యామల, ఓరుగంటి నెహ్రూ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని బుచ్చయ్యపేట, రాజాం, సీతయ్యపేట, దిబ్బిడి గ్రామాల్లో రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు వైసిపి శ్రేణులు పూలమాలల వేసి నివాళులర్పించారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట, వడ్డాది నాలుగు రోడ్డు జంక్షన్‌లో రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేశారు. స్వీట్లు పళ్ళు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ దొండా నారాయణమూర్తి, వైసిపి నాయకులు కోళ్ళమల్ల అచ్చం నాయుడు, కోవెల జనార్దన్ రావు, దాడి సూర్య నాగేశ్వరరావు పాల్గొన్నారు

సబ్బవరం : స్థానిక మూడు రోడ్ల జంక్షన్‌లో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎంపీపీ బోకం సూర్యకుమారి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి బాబు, సబ్బవరపు ముత్యాలనాయుడు, కాపుశెట్టి శేషుబాబు, డి పద్మావతి, డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురంలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానిక ఎమ్మెల్యే కన్నబాబు రాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, వైసిపి నాయకులు దేశంశెట్టి శంకర్రావు, కోన బుజ్జి, పి.వాసురాజు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ సంతబయలు వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పూలమాల వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైసిపి



మర్రిపాలెంలో నివాళి అర్పిస్తున్న ఆనంద్‌కుమార్

నాయకులు చుక్క రాము నాయుడు, కోన రామరావు, వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు పాల్గొన్నారు.

నక్కపల్లి: రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక సిహెచ్‌సిలో ఎమ్మెల్యే గొల్ల బాబురావు చేతుల మీదుగా రోగులకు పాలు, రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆయన కొబ్బరి తోటలో ఎమ్మెల్యే చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నక్కపల్లిలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. అన్న సమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, జడ్పిటిసి కాసులమ్మ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:మండల కేంద్రంలో బొలిశెట్టి గోవింద్, జడ్పీటీసీ కాకర్ల దేవి వైయస్ఆర్ విగ్రహనికి పూలమాలలు వేశారు. సర్వశుద్ధి, కొర్రప్రోలు, వెంకటాపురంలో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, కొనతల శ్రీను, దూళి శీను బాబు పాల్గొన్నారు.

చీడికాడ: మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలను వేశారు. నాయకులు, కార్యకర్తలు తదితరు పాల్గొన్నారు.

పాయకరావుపేట:పట్టణంలోని ప్రధాన మెయిన్ రోడ్డులో వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబురావు పూలమాలలు వేసి శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రసార పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా,జిల్లా వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిక్కాల రామారావు, ప్రచార పబ్లిక్ వింగ్ చైర్మన్ దగ్గుపల్లి సాయి బాబా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాసరావు, జడ్పిటిసి లంక సూర్యనారాయణ, ఎంపీపీ పార్వతీ తాతారావు, వైస్ ఎంపీపీ పల్లిల మణికంఠ స్వామి, దానిశెట్టి బాబురావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: వైయస్సార్ 14వ వర్ధంతి సందర్భంగా స్థానిక అబీద్ సెంటర్లో గల వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, మహిళలకు, నిరుద్యోగులకు, రైతులకు అన్ని విధాలా ఆదుకొని రాష్ట్రంలోసు పరిపాలనందించినటువంటి మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు.

కరాస: మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని వైసిపి కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎటిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించి, 150 మందికి కంటిపరీక్షలు చేశారు. 50 మందికి కంటి అద్దాలు, మందులను ఆనంద్ కుమార్ అందజేశారు. 52వ వార్డులో 21 మందికి కొత్త పింఛన్లు అందజేశారు. జివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు పాల్గొన్నారు.

పద్మనాభం : స్థానిక మండల పార్టీ కార్యాలయంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మండల వైసిపి అధ్యక్షులు కోరాడ లక్ష్మణ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు పేదలకు పిల్లలకు స్వీట్స్ పంపిణీ చేశారు ఎంపిపి రాంబాబు జడ్‌పిటిసి గిరిబాబు,సన్యాసినాయుడు పాల్గొన్నారు.

సీతమ్మధార : రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా, 39వ వార్డు పాతపోస్టాఫీస్‌ఏరియా కోటవీధి జంక్షన్ వద్ద పేదలకు చీరలను వైసిపి నేత సీతంరాజు సుధాకర్ పంపిణీచేశారు. నేతలు ఎల్లాజీ, అదిల్, కిషోర్, అప్పారావు, బుజ్జి, చంద్రకళ, శివ, ప్రసాద్, సలీం, సత్య పాల్గొన్నారు.

37వ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ చెన్నా జానకిరామ్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు. సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో పేదలకు చీరలు, పలువురు పేదలకు రెండు నెలలకు సరిపడా రేషన్ పంపిణీ చేశారు. వార్డు ఇన్‌ఛార్జి ఆకులు ఏసు పాల్గొన్నారు.

29వ వార్డు కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వురికిటి నారాయణరావు ఆధ్వర్యంలో జగదాంబ జంక్షన్‌లో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి సీతంరాజు సుధారక్ నివాళులు అర్పించారు. అమెరికన్ హాస్పిటల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, భోజనాన్ని సమకూర్చారు.

41వ వార్డు, జ్ఞానాపురంలో జివిఎంసి కోఆప్షన్ మెంబర్ యాంద్రపు ఫాతిమారాణి, 41వ వార్డు వైసిపి ఇన్‌చార్జి యాంద్రపు నికిలేష్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పేదలకు చీరలను సీతంరాజు సుధాకర్ అందజేశారు. రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు

ఉత్తర నియోజకవర్గంలో...

ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో రాజశేఖరరెడ్డిచిత్రపటానికి సమన్వయకర్త కెకె.రాజు ఘన నివాళులు అర్పించారు పేదలకు చీరలు పంపిణీ చేశారు డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు అల్లు శంకరరావు,కంటిపాము కామేశ్వరి, కె.అనిల్ కుమార్ రాజు, సాడి పద్మరెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, బర్కత్ అలి, శశికళ, సేనాపతి అప్పారావు, పేడాడ రమణికుమారి పాల్గొన్నారు.

51వవార్డులో కార్పొరేటర్ రెయ్యి వెంకట రమణ ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. లవ్ అండ్ కేర్ వికలాంగ బాలలకు అల్పాహారం అందజేశారు.

భీమునిపట్నం: స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి



పాయకరావుపేటలో..

పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు

నాలుగోవార్డులో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఒకటో వార్డులో పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, జగుపిళ్ల ప్రసాద్ పాల్గొన్నారు

ములగాడ : 40వ వార్డులో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెందుర్తి : సుజాతనగర్ మెయిన్ రోడ్డులో రాజశేఖరరెడ్డి విగ్రహానికి 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 97వ వార్డు అధ్యక్షులు మెంటి మహేష్ పూలమాలు వేసి నివాళులు అర్పించారు.

సింహాచలం: సింహాచలం ప్రధాన కూడలిలో వైఎస్ఆర్ వర్ధంతిలో వార్డు అధ్యక్షులు కొలుసు ఈశ్వరరావు నాయకులు ఎర్రవరం బాబు, లంక సత్తిబాబు పీతల అప్పలరాజు కె జగదీష్ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు మహిళలకు చీరలు పంపిణీ చేశారు పార్టీ మండలఅధ్యక్షులు బంక సత్యనారాయణ జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు పాల్గొన్నారు.

లోడగలవానిపాలెంలో మాజీ సర్పంచ్ లోడగల రమణ, ఎంపిటిసి రౌతు శ్యామల వెంకటరావు ,ఉప సర్పంచ్ ఈగల నాగరాజు, పాండ్రింకి అప్పారావు ,బంక కృష్ణమనాయుడు, ఆనందపురంలో సర్పంచ్ చందక లక్ష్మి సూరిబాబు, గిడిజాలలో వైస్‌ఎంపిపి పాండ్రంకి శ్రీను, సర్పంచ్ సినగం అప్పలరాజు, కోరాడ ముసలి నాయుడు, శొంఠ్యాంలో సర్పంచ్ లంక లావణ్య రాంబాబు, మాజీ ఎంపిటిసి కోరాడ వెంకటరమణారావు, రౌతు శ్రీను, వెల్లంకిలో కాకర వెంకటరమణ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, కంచరపు శ్రీను పాల్గొన్నారు

ఆరిలోవ : 11వ వార్డు బాలాజీనగర్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి నివాళులు అర్పించారు. 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో తూర్పు సమన్వయకర్త, ఎంపి ఎంవివి సత్యనారాయణ పాల్గొని ఆరిలోవ కాలనీలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించారు. పభుత్వ బాలుర హాస్టల్ విద్యార్థులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసారు.

విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో 35వ వార్డులో జరిగిన కార్యక్రమంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వార్డు కార్పొరేటర్ విల్లూరు భాస్కరరావు పాల్గొన్నారు.

27వ వార్డు దొండపర్తి రామాలయం వద్ద వైసిపి వార్డు అధ్యక్షులు నీలాపు సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బి.జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 39వ వార్డులో శ్రీ కనకమాలక్ష్మి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో పాత లక్ష్మీ టాకీస్ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్ కుమార్ పాల్గొని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు.

శ్రమదానంతో గోతులు పూడ్చిన భక్తులు

ప్రజాశక్తి-మాడుగుల:మండలం లోని కెజె పురం జంక్షన్ సంతోషి మాత ఆలయం వద్ద ప్రధాన రహదారి గుంతలను భక్తులు శనివారం శ్రమదానం తో పూడ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ళ అమ్మతల్లి నాయుడు ఆధ్వర్యంలో కొద్ది రోజుల కిందట అమ్మ వారి మాలాధారణ కార్యక్రమం చేపట్టారు. ఆలయం ముందు ప్రధాన రహదారి మరమ్మత్తుకు గురి కావడంతో వీరు శ్రమదానంతో పనులు చేపట్టారు. వీరిని పలువురు పాదచారులు, స్థానికులు అభినందనలు తెలిపారు.



గొయ్యిని పూడుస్తున్న భక్తులు

ఉపాధ్యాయులను నియమించండి

- జిల్లా విద్యాశాఖ అధికారికి సిపిఎం వినతి

ప్రజాశక్తి -చీడికాడ: చీడికాడ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శంకర్రావు కోరారు. ఈ మేరకు శనివారం అనకాపల్లి జిల్లా విద్యా శాఖ అదికారి వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ, చీడికాడ మండలంలో మోడల్ స్కూల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు విద్యలో ఏ విధంగా రాణిస్తారని ప్రశ్నించారు. పాఠశాలలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కారం చేయాలని లేదంటే విద్యార్థులతో కలిసి ఆందోళన చేస్తామని తెలిపారు. స్కూల్లో 532 పిల్లలు ఉంటే కనీసం తాగడానికి ఆర్ఓ ప్లాంట్ లేక పోవడం అన్యాయమన్నారు. గతంలో నాస స్వచ్ఛంద సంస్థ వాటర్ ప్లాంటును మంజూరు చేసిందని, అది పూర్తిగా ములన పడిందని తెలిపారు. వందమంది అమ్మాయిలకు హస్టల్ ఉంటే పర్మినెంట్ వార్డెన్ లేక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. మోడల్ స్కూల్ పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్షంగా ఉందో దీన్ని చూస్తే అర్థమవుతుందని తెలిపారు. తాత్కాలింగా ఉన్న వార్డన్ కూడా ఆగష్టు 1వ తేదీ నుండి వెళి పోయారని, పర్మినెంట్ వార్డెన్ నియమించాలని డిమాండ్ చేసారు. ఇంత మంది ఆడపిల్లలు ఉన్న హస్టల్లో ఆరోగ్యం బాగోలేక పోతే చూసు కోవడానికి కనీసం మహిళా హెల్త్ వర్కర్‌ను నియమించక పోవడం దుర్మార్గమన్నారు. తీమిరాం, వాకపల్లి, చీడిపల్లి, తురువోలు, తంగడు బిల్లి మీదుగా స్కూల్‌కు ఆర్‌టిసి బస్సు ను నడపాలని కోరారు. బాత్ రూమ్ డోర్సు, ఫ్యాన్లు, లైట్లు సౌకర్యాలు మెరుగు పర్చాలన్నారు. పాఠశాలలో దీర్ఘకాలిక సమస్యలు వెంటనే పరిష్కరించి పిల్లలు చదువుకోవడానికి మరింతగా అబివృద్ధి చేయాలని కోరారు,



వినతిపత్రాన్ని ఇస్తున్న వెంకన్న, శంకరరావు



శంకుస్థాపన చేస్తున్న మంత్రి

మంత్రి అమర్‌నాథ్ పర్యటన

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలోని గోపాల పట్నంలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌ను మంత్రి గుడివాడ అమర్నాథ్, పాయకరావుపేట శాసనసభ్యులు గొల్ల బాబురావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్నాథ్, బాబురావు మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి రైతు బాంధవుడని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్తు, ఆరోగ్యశ్రీ, పోలవరం ప్రాజెక్టు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డిదే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అభివద్ధి కమిటీ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా ప్రచార పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గుటూరు శ్రీనివాసరావు, జడ్పిటిసి లంక సూర్యనారాయణ ఎంపీపీ పార్వతి తాతారావు వైయస్సార్ వైయస్సార్ ఎంపీటీసీలు సర్పంచులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

దాతల సహకారంతో అన్న సమారాధన

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ప్రతీ శనివారం దాతల సహకారంతో అన్న సమారాధన విజయవంతంగా కొనసాగుతుంది. శనివారం ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యుల పర్యవేక్షణలో నిర్వహించిన అన్న సమారాధనలో 1000 మంది భక్తులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు. ఎంజేపీ గురుకులాల జిల్లా కన్వీనర్ ఎన్.వెంకటరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పీసపాటి శేషాచార్యులు, ఇల్లింద రామగోపాల్, భాగవతం సాయి గోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఈనెల 4న తన పుట్టిన రోజు సందర్భంగా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి జిల్లాలో యువత సహకరించాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లా డుతూ, తన పుట్టినరోజు సందర్భంగా నర్సీపట్నంలో ఎన్టీఆర్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామని, ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న యువకులు రక్తదానం చేయడం ద్వారా కొంతమంది ప్రాణాన్ని నిలబెట్టిన వాళ్ళవుతారని అన్నారు. గత 40 సంవత్సరాల నుండి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడటం జరిగిందని తెఇపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలతో పాటు యువత, విద్యార్థులు కూడా పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.



సచివాలయం అద్దె బకాయిలు చెల్లింపు

ప్రజాశక్తి- వడ్డాది: లోపూడి సచివాలయ భవనానికి అద్దె బకాయిలను అధికారులు చెల్లించారు. రెండేళ్లుగా బకాయి పడిన అద్దెను చెల్లించాలని కోరుతూ ఇంటి యజమాని సకలా బాబురావు సచివాలయానికి తాళాలు వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పది రోజుల్లోగా చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఇంటి యజమాని అంగీకరించారు. దీంతో, శనివారం ఈవో లోవరాజు ఇంటి అద్దె పూర్తి బకాయి రూ.50వేలను బాబురావుకి అందించారు.



చెల్లిస్తున్న నగదు



ఫ్యాన్లు ఇస్తున్న దాతలు

ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలో కాంగ్రెస్ పార్టీ నేత మేడేటి శంకర్ ఆధ్వర్యంలో శనివారం వైయస్సార్ వర్ధంతిని నిర్వహించారు. వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక కొత్తపేట, ఎన్.టి.ఆర్ కాలనీలో అంగన్వాడి కేంద్రాలకు ఫ్యాన్లు బహూకరించారు. చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రఘు, అల్లాడ శ్రీనివాసరావు, ముద్దా త్రినాథరావు పాల్గొన్నారు.

నందీశ్వరుని విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట పంచాయతీ శివారు బోయపాడు గ్రామంలో శనివారం నందీశ్వరుడు విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. పురోహితులు ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రతిష్ట కార్యక్రమం చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అన్న సమారాధన చేపట్టారు.

సమస్యలపై ముఠా కార్మికుల నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట: ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శనివారం రోలుగుంటలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, నర్సీపట్నం డివిజన్‌లో వివిధ రకాలుగా రోజు పనిచేస్తున్న ముఠా కార్మికులు సుమారు 1000 మంది వరకు ఉన్నారని తెలిపారు. కార్మికుల వల్ల, వ్యాపారుల నుంచి వేల కోట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం వస్తుందన్నారు. తక్షణమే ముఠా కార్మికులకు భీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సమగ్ర చట్టం చేయాలని, కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మికులు కృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు

విజయవాడ డివిజన్‌లో భారీగా రైళ్ల రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా 16 రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు. ఈ క్రమంలో 17267 కాకినాడ-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 17268 విశాఖపట్నం-కాకినాడ ప్యాసింజర్ స్పెషల్, 07466 రాజమండ్రి-విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్, 07467 విశాఖపట్నం - రాజమండ్రి ప్యాసింజర్ స్పెషల్, 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను సెప్టెంబర్ 5 నుంచి 9 వరకు, 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్, 12805 విశాఖపట్నం-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లను సెప్టెంబర్ 3 నుంచి 9 వరకు, 17240 విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 6 నుంచి 11 వరకు, 17244 రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్, 12806 లింగంపల్లి-విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 4 నుంచి 10 వరకు, 12718 విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12717 విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 3 నుంచి 10 వరకు రద్దు చేశారు. 17219 మచిలీపట్నం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 4 నుంచి 9 వరకు, 17220 విశాఖపట్నం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 5 నుంచి 10 వరకు, 22701 విశాఖపట్నం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ-విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 5, 6, 8, 9 తేదీల్లో రద్దు చేశారు. 22708 తిరుపతి-విశాఖపట్నం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 6, 8 తేదీలలో తిరుపతి నుంచి బయలుదేరి సామర్లకోటలో షార్ట్ టర్మినేట్ అవుతుంది. కావున 22707 విశాఖపట్నం-తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం కాకుండా సెప్టెంబర్ 7, 9 తేదీలలో సామర్లకోట నుంచి ప్రారంభమవుతుంది.

16 నుంచి మున్సిపల్ వర్కర్ల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆగస్టు 31లోగా మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన జివిఎంసి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి యు.రాజు అన్నారు. తమ యూనియన్‌తో జూన్ 16న చేసుకున్న ఒప్పందాన్ని, ఆనాటి మినిట్స్‌లో పేర్కొన్న 38 డిమాండ్లను అమలు చేయాలని కోరారు. ఈ మేరకు శనివారం జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మకు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌లను కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మినిట్స్‌లో పేర్కొన్న 38 అంశాలను ఈ నెల 14వ తేదీలోగా పరిష్కరించాలని లేకుంటే 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లడం తథ్యమని హెచ్చరించారు.

హరికృష్ణకు నివాళి

ప్రజాశక్తి -కలెక్టరేట్ : నందమూరి హరికృష్ణ 68వ జయంతి వేడుకలు శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఘనంగా జరిగాయి. గ్రేటర్ విశాఖపట్నం ఎన్‌టిఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు పొలమరశెట్టి శ్రీను, రాష్ట్ర గవర సాధికార సమితి కార్యదర్శి శరగడం భాస్కర్, పార్లమెంట్ అధికార ప్రతినిధి యర్నాగుల జగదీష్, కీర్తి ప్రసాద్, లక్ష్మణ్, మేడపల్లి సురేంద్ర, మహమ్మద్ గౌస్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.